కథ:

# ఇందులేఖ

•

శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి

ఆ గ్రామములో పురుషోత్తమరావు సంపన్న గృహస్థు. ఆయనమూడోకొడుకు శ్రీనివాసరావు బి. ఏ. పరీక్ష ఇచ్చి కొద్దిరోజుల క్రిందట ఇంటికి వచ్చినాడు. అతనికి వివాహమై నాలుగేండ్లైనది. భార్య కాపురానికి వచ్చికూడా సంవత్సరము కావచ్చినది. అతని వయస్సు ఇరవైరెండేండ్లు. మంచి ప్రవర్తనా, చక్కని నియమములూ కలవాడు. అయితే తండ్రికి అతనిమీద కోపము. మొదటికారణము బ్రహ్మసమాజములో చేరినాడని; రెండవది ఇంట్లో పదహారేండ్ల భార్య ఉంటే ఆమెవంక చూడనైనా చూడడని.

శ్రీనివాసరావుభార్యపేరు ఇందులేఖ. ఆమె బుద్ధిమంతురాలు. సామాన్యముగా చదువుకొన్నది. కాని ఈ కాలపు నవనాగరకతారీతులు లేకపోవడము చేత ఆమెవేషభాషలు, ఆచారవ్యవహారాలు అంత నవీనముగా ఉండవు. ఇందులేఖ సౌందర్యవతి. ముఖమున లక్ష్మీకళ ఉట్టిపడుతూఉంటుంది. కనుకొలకుల నుండి యౌవనరేఖలు ఇప్పుడిప్పుడే తొంగిచూస్తున్నవి. అయితే భర్త విముఖుడుగా ఉండడముచేత ఆమె ముఖశ్రీమీద విచారచ్ఛాయలు అప్పుడప్పుడు పొడచూపుతున్నవి. శ్రీనివాసరావు సెలవులకు ఇంటికి వచ్చినప్పుడెల్ల ఇంటిలోనివారూ, ఇరుగుపొరుగమ్మలూ భార్యాభర్తల నిద్దరిని కలుపవలె నని ఎంతో ప్రయత్నము చేసినారు. కాని కృతకృత్యులు కాలేకపోయినారు.

ఒకరోజున అన్నము పెట్టుతూ శ్రీనివాసరావుతో అతని నాయనమ్మ ఇలా అన్నది:

"ఏమిరా, నాయనా! పడకటిగదిలో పక్క వేస్తే బయటింటిగదిలో పడుకొంటావేమిటి? నీకు భార్య అక్కరలేదా?"

"ఆమె నాకు భార్యకాదు."

"భార్య కాదూ—భార్య కాదూ? ఏమిటిరా నాయనా, ఈ పిచ్చిమాటలు!"

"పిచ్చిమాటలు కావు, నాయనమ్మా!"

"కాక మరేమిటిరా, అబ్బాయీ! అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకొన్నది భార్య కాక మరేమి అవుతుంది?"

"ఆమె నాకు చెల్లెలువంటిది."

"ఏమిటీ—ఏమిటీ! చెల్లెలువంటిదా! అయ్యో, ఇదేమి విపరీతమురా, నాయనా?"

"విపరీతము ఏమీ లేదు, నాయనమ్మా! నేను ఆమెను ప్రేమించి పెండ్లిచేసుకోలేదు. అందుచేత ఆమె నాకు భార్య కాదు."

"ఊరంతా ఒక త్రోవా, ఉలిపికట్టె ఒక త్రోవానా? లోకములో అంతా ప్రేమించే పెండ్లి చేసుకొంటున్నారా?"

"నా సంగతి నేను చెప్పినాను."

"అయితే మరి ఎందుకు పెండ్లి చేసుకొన్నావు?"

"అప్పుడు నాకు ఈ మతమూ, నియమములూ లేవు."

"అయితే ఇపుడు మతము మార్చుకొని దాని బ్రతుకు పాడుచేస్తావా? ఇదేనా నీ మతధర్మము? పసిపిల్లగదా! ఇక దాని జీవితము ఏమి కావాలె?"

"ఆమెజీవితము కేమీ లోపము లేదు, నాయనమ్మా! ఆమెనుకూడా బ్రాహ్మమతములో చేరుస్తాను. తరువాత ఆ మతనియమముల ప్రకారము ఇద్దరము వివాహబంధము ఛేదించుకొంటాము. ఆపైన ఎవరి

ఎవరిమీద ప్రేమ కలిగితే వారు వారిని వివాహ మాడవచ్చు."

"ఆఁ—ఆఁ—అయ్యో—అయ్యో!—"

*　　　*　　　*

శ్రీనివాసరావు వివాహానంతరము చదువుకోసము కాకినాడ వెళ్లినాడు. సెలవులలో చుట్టపుచూపుగా ఇంటికి వచ్చివెళ్లడమే కాని నాలుగుసంవత్సరముల నుంచి అతని కాలమంతా అక్కడే గడచినది. బి. ఏ. చదువుతూ ఉండగా అతనికి రఘుపతితో స్నేహము కలిసినది.

రఘుపతి బ్రాహ్మమతదీక్షితుడు. అతను కాలేజీలో అధ్యాపకుడుగా పనిచేస్తున్నాడు. వయస్సు నలభై సంవత్సరములు. బుద్ధిమంతుడు. సజ్జనుడు. అతని యింటికి వస్తూపోతూ ఉండగా శ్రీనివాసరావుకు శైలబాలతో పరిచయము కలిగినది.

శైలబాల రఘుపతికి పినతల్లికూతురు. ఆమెది రాజమహేంద్రవరము. అక్కడ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నది. మెరుగుచామనచాయలో ఆమె కొంచెము అందముగానే ఉంటుంది. అయితే నవీననాగరకతాపద్ధతుల ననుసరించి సౌందర్యపోషణ మార్గము లవలంబించడముచేత చాలా సౌందర్యవతివలె కనబడుతుంది.

శ్రీనివాసరావుకును, శైలబాలకును పరిచయము క్రమముగా అభివృద్ధిఅయినది. వాళ్లిద్దరూ కలిసి పార్కుకూ, సముద్రతీరానికీ విహారార్థము వెళ్లుతూ ఉండేవారు. స్వేచ్ఛగా సంభాషిస్తూ అరమర లేకుండా నవ్వుకొంటూ ఉండేవారు. క్రమముగా శ్రీనివాసరావుకు శైలబాలపలుకులలో ఆదరము వినిపించినది. ఆమెదరహాసములో అతనికి కోరికలు గోచరించినవి. ఆమెఆలోకనములలో అతనికి అనురాగము అనుభూతమైనది.

కొంతకాలము గడచినది. బొమ్మలపండుగ సెలవులు వచ్చినవి. శైలబాల అన్నగారి యింటికి వచ్చినది. సాయంకాలము టీ పుచ్చుకొంటూ, "ఇవాళ శ్రీనివాసరావుగారు రాలేదేమి? ఊళ్లో ఉన్నారా?" అని అడిగినది శైలబాల. "ఊళ్లోనే ఉన్నాడు. నిన్నసాయంకాలముకూడా కనిపించినాడు. ఎందుచేత రాలేదో!" అన్నాడు రఘుపతి.

అయిదుగంటలకు పార్కుకు వెళ్లే వేళకు శ్రీనివాసరావు వస్తాడేమో అని శైలబాల నిరీక్షించినది. కాని అతను రాలేదు. మరునాడు, మూడోనాడుకూడా అతను రాలేదు. నాలుగోరోజున రఘుపతి క్లబ్బుకు పోతూఉండగా శ్రీనివాసరావు కనిపించినాడు. ఇద్దరూ కలిసి ఊరిబయటికి వెళ్లి పెద్దమర్రిచెట్టుక్రింద ఏకాంతముగా కూర్చున్నారు. అప్పుడు రఘుపతి ఇలా అన్నాడు:

"ఏమోయ్, శ్రీనివాసూ! బొత్తిగా కంటిలో నలుసైపోయినావే! అప్పుడే పరీక్షలకు అంత ఎడాతెరపీ లేకుండా చదువుతున్నావా ఏమిటి?"

"అంత ఎక్కువగా చదవడము లేదు."

"మరి? సెలవులు గదా! టీకోసమైనా రావడము లేదేమి? శైలబాల వచ్చిన సంగతి తెలుసునా?"

శ్రీనివాసరావు తెలుసు నన్నట్లు తల ఊగించినాడు.

"అయితే ఆమెను చూచుటకైనా రాలేదేమి? ఆమె నన్ను ఎన్నోసార్లు అడిగినది."

శ్రీనివాసరావు మాట్లాడలేదు. అతని వైఖరి చూచేసరికి రఘుపతికి కొంచెము అనుమానము కలిగినది. ఏదో జరిగిన దనుకొన్నాడు. అతనివంక తేరిపార చూస్తూ ఇలా అన్నాడు: "ఆమె ఏదైనా పరుషముగా గాని, అగౌరవముగాగాని..."

"అట్టిది ఏమీ లేదు. ఆమెమాటలలోగాని, వైఖరిలోగాని పేరుపెట్టదగినది అణుమాత్రముకూడా లేదు. పైపెచ్చు చక్కని సరసత, మనోహరమైన మర్యాదా ఆమెలో నిరంతరము తొణికిసలాడుతూ ఆమె నవనీతహృదయమును వెల్లడిస్తూ ఉంటవి."

"అట్లయితే నీవు రాకపోవడానికి కారణమేమిటి?"

శ్రీనివాసరావు మౌనముగా తల వంచుకొన్నాడు.

"అయితే ఏదో ఉన్నదన్నమాట! నాదగ్గిర దాచ నక్కరలేదు. నేను నీకు సోదరునివంటివాడను. నాతో విప్పి చెప్పవచ్చు."

"చెప్పకూడ దని కాదు."

"మరి?"

"చెప్పటకు సిగ్గుగా ఉన్నది."

"సి గ్గెందుకోయ్, వెర్రివాడా!"

"ఆమె—ఆమె—"

"సందేహించకు, బెరుకు లేకుండా చెప్పు."

"ఆమెవాలుచూపులలోను, చిరునవ్వుమాటల లోను ఏదో మనోహరత, ఏదో మాధుర్యము అనుభూత మవుతున్నది. ఆమెసన్నిధిలో ఏదో ప్రీతి ఉప్పొంగు తున్నది. ఈ విషయములో నన్ను నేను పరిశీలించు కొన్నాను. ఇది చిత్తచాంచల్య మనీ, దీనికి కారణము మనోదౌర్బల్య మనీ నిర్ణయించుకొని పశ్చాత్తాపపడు తున్నాను. నిగ్రహముకోసము ప్రయత్నిస్తున్నాను."

రఘుపతి ఆసాంతము నిశ్శబ్దముగా విని చివరకు పకుక్కన నవ్వి ఇలా అన్నాడు: "పిచ్చివాడా! ఇందు కోసము పశ్చాత్తాప మెందుకు? ఇది చిత్తచాంచల్యమూ కాదు, మనోదౌర్బల్యమూ కాదు. ఇది ప్రేమలక్షణము. ప్రేమ అనేది ఐశ్వరికశక్తివికాసము. దానికి ఎట్టి అవస్థలోను పాపసంపర్కము కలుగదు."

శ్రీనివాసరావుహృదయముమీదినుంచి కొండ తీసివేసిన ట్లైనది. ఆతనిముఖము విప్పారినది. అతను నూతనోత్సాహముతో గొంతు సవరించుకొంటూ మృదువుగా ఇలా అన్నాడు: "ఇది—ఇది ప్రేమే అయితే..."

"అయితే ఏమిటి? ప్రేమే! సందేహము లేదు. నీవు సరళహృదయుడవు కావడముచేత ప్రేమావిర్భావమును అన్యథా అవగతముచేసుకొన్నావు. అది అలా ఉంచు. ప్రతిస్నేహము ప్రణయస్వభావము. అందుచేత శైలబాలకుకూడా నీమీద ప్రేమ అంకురించి ఉంటుంది."

"మీ మాట అవు ననవలెనో, కా దనవలెనో తెలియడములేదు. కాని ఆమెఆదరములోను, హావభావాలలోను ఏదో వైలక్షణ్యము, ఏదో ఆకర్షణ, ఏదో మాధుర్యము..."

"అవును. నాకు తెలుసును. అనురాగము అన్యోన్యహృదయసంవాది. ఆమెకు నీమీద తప్పక ప్రేమ ఉదయించిఉంటుంది. సందేహము లేదు. ఆహా! ఇవాళ నాకు చాలా సంతోషముగా ఉన్నది. ఇలా పూర్వానురాగము పెంపొందిన తరువాత వివాహము జరిగితే అది ఆదర్శవివాహ మవుతుంది."

"అలా కాకపోతే?"

"అప్పు డది వివాహమే కాదు. అంతేకాక ఆ వివాహితులు భార్యాభర్తలు కావడానికే వీలులేదు."

"అయితే వివాహానంతరము అనురాగము ఉదయించ దంటారా?"

"నిజమైన అనురాగము ఉదయించ దనే నా విశ్వాసము. ఒకవేళ ఉదయించినా సంసారయాత్రకు పరరాగము పర్వతమార్గమువంటిది అవుతుంది."

"పూర్వరాగములో మాత్రము ఒడుదొడుకు లుండవా?"

"పూర్వరాగము పుష్పశయ్యవంటిది. అందులో ప్రాణముతో ప్రాణమూ, ఆత్మతో ఆత్మ మేళవిస్తవి. అప్పుడు ప్రేమకు సాఫల్యము కలుగుతుంది."

తరువాత మిత్రు లిద్దరు మౌనము వహించినారు. అప్పుడు వారి మనస్సులలో ఎట్టి ఆలోచనలు మెరసినవో, ఎట్టి తృప్తి నిండుకొన్నదో! శైలబాలకు కూడా తనమీద అనురాగముదయించిన దని శ్రీనివాసరావు ఉవ్విళ్ళూరినాడేమో! ఆదర్శవివాహానికి అంకురార్పణ అయినదని రఘుపతి ఉప్పొంగినాడేమో!

మరునాడు సాయంకాలము శ్రీనివాసరావు రఘుపతిఇంటికి వచ్చినాడు. కాని అతనికి శైలబాల దర్శనము కలుగలేదు. ఆమె తలవనితలంపుగా ఆ ఉదయమే రాజమహేంద్రవరము వెళ్లిపోయినది. ఆ సంగతి చెప్పుతూ రఘుపతి, "శైలబాలప్రయాణముసంగతి నీకు తెలుపుటకుకూడా అవకాశము లేకపోయినది సుమా!" అని నొచ్చుకొన్నాడు. శ్రీనివాసరావు చిన్నబుచ్చుకొన్నాడు.

అది గమనించి రఘుపతి, "మిత్రమా! నీవు నిరుత్సాహపడనక్కరలేదు. నీటిబుగ్గ ఉప్పొంగినతరువాత దాని వేగము దుర్నివారము. కనుక త్వరలోనే పునస్సమాగమము కలుగుతుంది" అని ధైర్యము చెప్పినాడు.

కాని రఘుపతి పలికిన భవిష్యద్వాణి ఫలించలేదు. అందుచేత శైలబాలహృదయము తెలిసికొనుటకు గాని, తన హృదయము ఆమెకు వెల్లడించుటకుగాని శ్రీనివాసరావుకు అవకాశము లభించలేదు.

*   *   *

జ్యేష్ఠమాసము. మధ్యాహ్నసమయము. బయట గ్రీష్మము నిప్పులు చెరుగుతున్నది. శ్రీనివాసరావు బయటింటి గదిలో మేజాబల్లముందు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆగది అతని సొంతము. రాత్రులు కూడా అతను అందులోనే పడుకొంటాడు. గోడకు కొన్ని ఆంగ్లేయపటములూ, ఏకతంత్రీవాద్యమూ తగిలించి ఉన్నవి. ఉదయమూ, సాయంకాలమూ ఏకతంత్రి వాయిస్తూ అతను బ్రాహ్మసంగీతము పాడుతూ ఉంటాడు. ఆగదిలో ఒక గడియారమూ, ఒక బీరువా, ఒక కోటుస్టాండూ, ఒక మంచమూ తప్ప ఇక సామాను లేవీ లేవు.

రఘుపతివద్దనుంచి అప్పుడే వచ్చిన ఉత్తరము డ్రాయరులోనుంచి తీసి శ్రీనివాసరావు చదవడము ఆరంభించినాడు. అందులో శైలబాలపేరు ఎక్కడెక్కడ వ్రాసిఉంటే అక్కడక్కడ ముద్దుపెట్టుకొన్నాడు. ఉత్తరము అవతల ఉంచి కనులు మూసుకొని ఏదో ఆలోచించినాడు. ఠంగ్ ఠంగ్ అని గడియారము రెండు గంటలు కొట్టినది. మెల్లగా కనులు తెరచి ఉత్తరము డ్రాయరులో ఉంచి, ఇంకొక కాకితము తీసుకొని ఆలోచించి ఆలోచించి, "నేటిరాత్రి పండ్రెండుగంటలకు అంతా నిద్రపోయిన తరువాత ఒకసారి నాగదిలోకి రావలెను" అని వ్రాసినాడు. వ్రాసి దానిని ఉండగా చేసి, డ్రాయరుకు తాళము వేసి బయటికి వెళ్లినాడు.

అంతఃపురములోకి వెళ్లి చూచినాడు. అక్కడ ఎవ్వరూ లేరు. మొదటిగదివద్దకు వెళ్లి చూచినాడు. అతని పెద్దవదిన స్నేహితురాలితో పచ్చీసు ఆడుతున్నది. రెండవగదివద్దకు వెళ్లి చూచినాడు. మంచముమీద పడుకొని తల్లి నిద్రపోతున్నది. అన్నకొడుకు పూరీలు, లడ్లు మొదలైనవి రహస్యముగా తింటున్నాడు. బాలకుడు పినతండ్రిని చూచి వెలా తెలాపోయినాడు. శ్రీనివాసరావు అతనిని గమనించకుండా అవతలకు వెళ్లిపోయినాడు. మూడవగది పూజామందిరము. అందులో విష్ణుమూర్తివిగ్రహ మున్నది. విగ్రహద్వేషి కావడముచేత అతను అటువైపు కన్నెత్తి చూడనైనా చూడకుండా వెళ్లిపోయినాడు.

అవతలి గదిలో అతని భార్య ఇందులేఖ చేతిరుమాలుమీద రంగురంగుల ఉన్నిదారముతో చిత్రము కుట్టుతున్నది. పూలతోను, కాయలతోను నిండిన దానిమ్మకొమ్మమీద రెండు చిలుకలు అనుకొని కూర్చుండి అన్యోన్యాలింగనపారవశ్యము అనుభవిస్తున్నట్లున్నవి—అది ఆమె కుట్టుతున్న చిత్రరూపము. ఆమె తదేకదృష్టితో కుట్టుపని చేస్తున్నది. ఆమెవదనమున చెమటబిందువులు ముత్యాలవలె శోభిస్తున్నవి. తాంబూలరంజితమైన అధరము సొంపులు చిమ్ముతున్నది. తొలిగీ తొలగని పయటలోనుంచి రత్నాలపతకము ముసిముసి నవ్వులు నవ్వుతున్నది.

శ్రీనివాసరావు నిశ్శబ్దముగా ఆగదివద్దకు వెళ్లి ఆశ్చర్యముతో ఆమెవంక చూస్తూ నిలుచున్నాడు. వివాహమైన తరువాత అతను భార్యను నిదానించి చూడడము ఇదే మొదటిసారి. ఇందులేఖ తల వంచుకొని తదేకధ్యానముతో చిత్రరూపము తీరుస్తూ ఉండడముచేత భర్తను చూడలేదు.

కొంతసేపైనతరువాత ప్రాంగణములోని మామిడిచెట్టునుంచి రయిమని వేడిగాలి విసరినది. ఆ ధ్వనికి ఉలిక్కిపడి ఇందులేఖ తల యెత్తి చూచినది. రెప్పవాల్చకుండా తనవంక చూస్తున్న భర్త కనిపించినాడు. తోడనే కంగారుతో చేతిలోని వస్తువులు అవతల ఉంచి లేచి చీరె సవరించుకొని మూలకు పోయి తల వంచి క్రీగంట చూస్తూ నిలుచున్నది. పయిటచెంగుకు కట్టిన తాళపుచెవులు గలగలమన్నవి.

ఆ గలగలకు తిరిగితిరిగి చూస్తూ శ్రీనివాసరావు చప్పుడు కాకుండా గదివాకిలివద్దకు వెళ్లి కాకితపు ఉండ ఆమెకాళ్లవద్ద పడవేసి వెళ్లిపోయినాడు.

భర్త వెళ్లగానే ఇందులేఖ కాగితపుఉండ తీసుకొని తలుపు బిగించి కిటికీవద్దకు వెళ్లి విప్పి చదువుకొన్నది. తరువాత కిటికీలోనుంచి బయటికి చూచినది. ఆమెదృష్టి ఎదురుగా దోరగాయలతో నిండిన మామిడిచెట్టుమీద పడినది. కాయలచాటున నక్కి కోయిల కువ్వూ అంటున్నది. దూరముగా పావురాలు కువకువమంటున్నవి. మళ్లీ ఆమె కాగితము చదువుకొన్నది. మళ్లీ మామిడిచెట్టువంక చూచినది. చెట్టుసందులలోనుంచి ఆకాశము కనబడినది. ఆ కాగితము రవికలో దాచుకొని వెళ్లి ఆమె విఘ్నమూర్తికి భక్తిపూర్వకముగా సాష్టాంగనమస్కారము చేసినది. తిరిగి తన గదిలోకి వచ్చి గడియ బిగించి తిరిగి కాగితము చదువుకొన్నది.

నేడామెజీవితములో ఎటువంటి దినము! కాపురానికి వచ్చిన తరువాత నేడే భర్త ఆమెను పలుకరించినాడు. సిగ్గుబిడియాల గుండెదడలతో వివాహము జరిగినది. తరువాత సమావేశనము మూడురోజులలోను పుష్పశయ్యయందు భర్తృదర్శనము కాలేదు. అప్పుడామెకు పదమూడేండ్లు. అప్పుడే శ్రీనివాసరావుకు నూతనమతప్రవేశము జరిగినది.

తరువాత ఒకసారి ఆమె అత్తవారింటికి వచ్చి కొన్నినెల లున్నది. ఇంటిలోనివారూ, ఇరుగుపొరుగువారూ నూతనదంపతులను కలుపవలెనని ఎంతో ప్రయత్నము చేసినారు. ఎంతో బ్రతిమాలినారు. ఏమి ప్రయోజనము? శ్రీనివాసరావు అంతఃపురములో పడుకొనలేదు. తరువాత కోపము వచ్చి వారా ప్రయత్నము మానివేసినారు. తల్లిమాత్రము విసుగుచెందక ప్రతిదినము అతనిని బలవంతపెట్టుతూ ఉండేది. ఆమె అనురోధము అతను చెవినిపెట్టలేదు.

దాంపత్యజీవితములో అతని విపరీతప్రవర్తనమూ ఆమెదురవస్థా వినేసరికి ఆమెబంధువులకూ, స్నేహితురాండ్రకూ గుండె లవిసిపోయినవి. "ఇక ఆమెజీవితము ఇలా వ్యర్థము కావలసినదేనా! పాప మా చిన్నది ఏమి పాపము చేసినదని ఈశ్వరు డిటువంటి శిక్ష విధించినాడు!" అని వాళ్లు విచారించినారు.

ఇన్నాళ్లనుంచి అతని మనస్సు ఏమైనది! ఇప్పుడామెదుఃఖమంతా తొలగిపోతుందా!

ఇందులేఖ ఏమిటో ఏమిటో ఆలోచిస్తున్నది. దాంపత్యజీవితసందర్భములో జరిగిన చిత్రసంఘటనలు ఆమెమనఃపటమున సినీమాచిత్రమువలె దృశ్యము లవుతున్నవి. ఇంతలో చటుకున ఆమెచింతాస్రవంతికి అడ్డు తగిలినది. బయటినుంచి ఎవరో తలుపుమీద గబగబ గుద్దినారు. ఇందులేఖ ఉలిక్కిపడి లేచి గడియ తీసినది. ఆమె చిన్న ఆడుబిడ్డ వరలక్ష్మి లోనికి వచ్చినది.

వరలక్ష్మి ఇందులేఖకన్న మూడేండ్లు పెద్దది. ఆమె కడుపుతో ఉండి నెలరోజులక్రిందట పుట్టింటికి వచ్చినది. వరలక్ష్మికిని, ఇందులేఖకును చక్కని అన్యోన్యము. పరస్పరసుఖదుఃఖములందు ఇద్దరూ సమభాగినులు. ఇందులేఖతొట్రుపాటు చూచి ఆశ్చర్యముతో, "ఏదో జరిగిన ట్లున్నదే!" అన్నది వరలక్ష్మి.

ఇందులేఖ మెల్లగా, "ఏ మున్నది జరగడానికి?" అన్నది.

"అయితే తలుపుబిగించుకొని ఏమిచేస్తున్నావు?"

ఇందులేఖ మాట్లాడలేదు. ఆమెముఖభంగి చూచి మరింత సందేహము కలిగి, కంఠము కౌగలించుకొని, "ఏమి జరిగినదో చెప్పవూ!" అని వరలక్ష్మి బ్రతిమాలినది.

"చెప్పుతాను."

"ఎప్పుడు?"

"రాత్రికి."

"కాదు. ఇప్పుడే చెప్పాలె."

ఇందులేఖ చెప్పలేదు. అయితే వరలక్ష్మి వదలలేదు. చివరకు ఎంతో బలవంతముమీద ఇందులేఖ చెప్పినది. విని వరలక్ష్మి మొదట ఊరకొన్నది. తరువాత మెల్లమెల్లగా నవ్వడము ఆరంభించినది.

"ఎందుకు నవ్వుతావు, వదినా?"

"నీ మగని వ్యవహారము చూచి నవ్వుతున్నాను. నేను ఎలా అనుకొన్నానో అలా జరిగినది. ఈసారి వచ్చినదగ్గిరనుంచి మా చిన్నన్నయ్య భలే హుషారుగా ఉన్నాడు. పెద్దవదినతోకూడా చెప్పినాను."

"ఏమని చెప్పినావు?"

"ఏమన్నానంటే—'వదినగారూ! ఈసారి మా చిన్నన్నయ్యమనసు మారినది. ఒక్కసారి కదిలించి చూడండి. తప్పకుండా గదిలో పడుకొంటాడు' అని. వదినగారు అన్నదిగదా—'ఆయనమనస్సు మారనీ మారకపోనీ! అందుకు నేనేమైనా అడ్డుపడ్డానా?' అని. అప్పుడు నేనేమన్నానంటే—'ఇదివరకు మనసు మారలేదనుకోండి ఇప్పుడుమాత్రము తనంతట తాను రాగలుగుతాడా? సిగ్గుపడుతున్నాడనుకొంటాను' అని. ఆమె ఏమన్నదంటే—'ఇద్దరినీ కలపాలని ఇదివరకు ఎన్నోసార్లు ప్రయత్నించిచూచినాను. ప్రయత్నించినపుడల్లా అవమానించినాడు. ఈసారి నేనుమాత్రము బ్రతిమాలుతానా ఏమిటి? నాకు మాత్రము అభిమానములేదనుకొన్నావా? నేను అటువంటి మనిషిని కాను. చేసుకొన్నవారికి చేసుకొన్నంత. ఇంకా రెండునెలలున్నవిగదా సెలవులు! సుఖించినా సరే, మానుకొన్నా సరే!' అని."

"నేను వెళ్లలేకుండా ఉన్నాను, వదినా!"

"ఎందుచేత?"

"ఆయన నన్ను చాలా సిగ్గుపరుస్తారు."

వరలక్ష్మి కనులు చీకిరించి, ముఖము చిట్లించి, కొంటె నవ్వు నవ్వుతూ ఇలా అన్నది: "ఓయబ్బో! పసిపిల్ల సుమా! నంగనాచి! మగనిదగ్గరకు పోవడానికట, సిగ్గట! సిగ్గు ఎంతసేపు ఉంటుందో చెప్పు—గంటలు లెక్కపెట్టుకొంటూ ఉంటాను. ఇక నా ముందు టక్కులు చేయడానికి వీలు లేదు."

"టక్కులు కావు వదినా! చాలా భయముగా ఉన్నది."

"మొదటిరోజు కొంచెము భయముగా ఉంటుంది. అంతే! ఆ ఒక్కరోజూ వెళ్లిపోదా ఏమిటి?

"అయితే ప్రతిదినమూ వెళ్లవలసిఉంటుందా?"

"అవును."

"అయితే ఈ ఒక్కరోజు పోకపోతే ఏమి?"

"ఊహూఁ! పోకుండా ఉండడానికి వీలు లేదు. సిగ్గు అనేది ఎప్పుడో ఒకప్పుడు పోవలసినదే కదా!"

"అంతకంటె ఒక్కసారి నీవు అక్కగారితో మళ్లీ చెప్పవూ! ఆమె ఏదో ఉపాయ మాలోచిస్తుంది!"

"అలాగే చెప్పుతాను. కాని నేటికిమాత్రము నీవు రహస్యముగా వెళ్లితీరాలి. తెలుసునా! మాగులోనుంచి దొంగిలించిన మామిడిపండులాగా రహస్యముగా లభించిన వస్తువు చాలా మధురముగా ఉంటుంది."

౨

"చిన్న వదినా, ఓ చిన్నవదినా! ఇంకా మెలకువ రాలేదూ?"

రాత్రివేళ శయ్యాగారములో వరలక్ష్మి ఇందులేఖను లేపినది. ఇందులేఖ కంగారుతో లేచి కనులు నులుముకొంటూ, "ఎన్ని గంటలైనది?" అని అడిగినది.

"పండ్రెండు దాటి పైన అరగంట అయినది."

"నీవుకూడా నిద్రపోయినావనుకొంటాను."

"లేదు—నాకళ్లకు నిద్ర ఎలా వస్తుంది? అబ్బా! అంతనిద్ర ఏమిటమ్మా నీకు? కార్యము అయ్యేవాళ్లకు హుషారు ఉండనక్కరలేదూ? ఇదే మామూలుగా జరిగితే ఇరుగుపొరుగమ్మల పేరంటము సందడితో ఇల్లంతా మారుమ్రోగుతుండేది!"

ఇలా అంటూ వరలక్ష్మి దీపము వెలిగించినది. పెట్టెలోనుంచి మంచి జరీచీరె తీసి, "ఇదిగో, కట్టుకో" అన్నది.

"ఎందుకు, వదినా? అంత అట్టహాస మవసరము లేదు."

"ఆ మాటలు కట్టిపెట్టు. ఆ మాసినచీరతోనే వెళ్లుతావా ఏమిటమ్మా, వెర్రిపిల్లా!"

ఇలా అంటూ వరలక్ష్మి ఆమెకొంగు పట్టుకొని ఊడలాగినది. ఇందులేఖ తప్పించుకోలేకపోయినది.

చీరె సింగారించడము అయిపోయినతరువాత, వరలక్ష్మి "ఒక్కదానివి వెళ్లగలవా? లేక నేను వెంట వచ్చి దిగబెట్టవలసిఉంటుందా?" అన్నది.

"నీవు నీకార్యమునాడు ఒంటరిగానే వెళ్లినావు కాబోలు!" అని అనబోయి, ఇందులేఖ, ఈ సమయములో వరలక్ష్మికి కోపము తెప్పించడము మంచిపనికాదనుకొని, సంబాళించుకొని, "నీవు రాకపోతే, కొత్త గదా, ఒంటరిగా ఎలా వెళ్లగలను?" అన్నది.

ఇద్దరూ తలుపు తెరచి వసారాలోకి వచ్చినారు. వెన్నెలరాత్రి. అంతటా నిశ్శబ్దము. ఇందులేఖ కాలిపట్టాలగజ్జలుమాత్రము గలగలమంటున్నవి. వరలక్ష్మి సంభ్రమముతో, "కాళ్లపట్టాలు తీసివేయలేదూ? ఊరుఊరంతా వినబడేటట్లున్నవే!" అన్నది.

ఇందులేఖ గజ్జలపట్టాలు తీసివేసి బాలీసుక్రింద పెట్టి వచ్చినది. తరువాత ఇద్దరూ ముందు సావడివైపు వెళ్లినారు. శ్రీనివాసుని గదివద్దకు వచ్చి, వరలక్ష్మి రహస్యముగా, "తలుపు దగ్గరగానే వేసిఉన్నది. మెల్లమెల్లగా జాగ్రతగా వెళ్లు" అని చెప్పి వెళ్లిపోయినది.

ఇందులేఖ మెట్లు ఎక్కి భర్త ఉన్న గది వసారాలోనికి వెళ్లినది. తలుపువద్దకు పోయి తొంగి చూచినది. దీపము వెలుగుతున్నది. లోపలికి పోవడానికి భయపడినది. శరీరము కంపించినది. గుండె దడదడ కొట్టుకొన్నది. కాలు ముందుకు సాగలేదు. చివరకు ఎలాగో ధైర్యము అవలంబించి ఆమె చప్పుడు కాకుండా తలుపు తెరచి లోపలికి పోయినది.

భర్త నిద్రపోతున్నాడు. తలగడదగ్గరగా దీపము వెలుగుతున్నది. ఇందులేఖ తలుపు మూసి గడియవేసి దీపము తీసివేసినది. తోడనే వెన్నెల చాటుమాటుల నుంచి చటుక్కున వెలిసి శయ్యమీద భర్తముఖముమీద పడి నవ్వ నారంభించినది. వెన్నెలనవ్వులలో భర్తవదన మామెకు ఎంతో ప్రసన్నముగా, ఎంతో సౌమ్యముగా కనిపించినది. ఆమె పతివదనము నింత పరామర్శగా చూడడము నేడే! చూచి చూచి, "ఇంత సౌమ్యుని హృదయములో అట్టి దుర్భావనలు ఎలా కలిగినవో!" అనుకొన్నది.

అలా ఒక్క క్షణము కడచినది. తరువాత ఇందులేఖ లోలోపల నవ్వుకొంటూ, "భలేవారు సుమా! నన్ను రమ్మని తాము నిశ్చింతగా నిద్రపోతున్నారు!" అనుకొన్నది. "ఇప్పుడు నాకు కర్తవ్య మేమిటి?" అని ఆలోచించినది. "భర్తృపాదసేవ నా కింతవరకు లభించినది కాదు. ఇప్పుడీ అవకాశము ఎందుకు పోగొట్టుకోవలెను!"అని నిశ్చయించుకొన్నది. తదుపరి పతిపాదములవద్ద కూర్చుని సంతోషముతో పాదసంవాహనము చేయడము మొదలుపెట్టినది. కిటికీనుంచి దక్షిణానిలము మధురమధురముగా వీస్తున్నది. అలా ఎంతకాలము—సుమారు అరగంట కడచినది. తరువాత ఆమె పతిచరణములవద్ద పడుకొని నిద్రపోయినది.

రెండుగంటలు కొట్టేసరికి శ్రీనివాసరావుకు నిద్ర మెలకువ వచ్చినది. తెలివి వచ్చినతరువాత కొన్ని నిమిషాలవరకు అతని మనస్సు ఎవరికోసమో ప్రతీక్షిస్తున్నట్లున్నది. క్రమముగా ఇందులేఖను రమ్మన్నట్లూ, నిద్ర రానంతవరకు ఆమెకోసము ఎదురు చూచినట్లూ, పండ్రెండున్నరఅయినతరువాత కూడా ఆమె రాకపోవడముచేత నిద్రపోయినట్లూ స్ఫురణ కలిగినది. ఇలా స్ఫురణతరంగాలు దొర్లుతూఉండగా అతను ప్రక్కకు పొరలినాడు. అప్పుడతని పాదము ఇందులేఖశరీరముకు తగిలినది. ఆ కోమలస్పర్శకు విస్మితుడై లేచి కూర్చున్నాడు.

ఇందులేఖ నిద్రపోతూనే ఉన్నది. అప్పటికి వెన్నెల తలాపినుంచి తొలగిపోయి ఇందులేఖకోమలవదనముమీద ముసిముసినవ్వులు నవ్వుతున్నది. ఆ మనోహరచంద్రికాప్రసారములో శ్రీనివాసరావు ఆ నిద్రాన్వితను, ఆ నవయౌవనవతిని, తన పత్నిని తిలకించినాడు. అప్పుడామెవదనమండలము భువనమోహనముగా కనిపించినది. అంతలో ఆమెపెదవులు కదలినవి. వాటిమీద చిరునవ్వు తొలకాడినది. నునుసిగ్గు తళుక్కుమన్నది. అప్పుడామె ఎట్టి కలలు కంటున్నదో!

శ్రీనివాసరావు భార్యముఖమువంక రెప్ప వాల్చక చూచిచూచి, "ఆహా! ఏమి ఈ మెదివ్య సౌందర్యము! శైలబాలసౌందర్యము ఇందులో ఎన్నో వంతు!" అనుకొన్నాడు. అలా ఎంతసేపు చూచినాడో! తరువాత కొంతసేపటికి చటుక్కున మొగ మావలకు త్రిప్పుకొని, కనులు మూసికొని, "ఈశ్వరా! నా మనోదౌర్బల్యము తొలగించు; నా హృదయానికి బలము అనుగ్రహించు!" అని అస్ఫుటస్వరముతో ప్రార్థించినాడు. ఆ పండువెన్నెలలో ఆ ఒంటరిపాటులో తన హృదయద్రఢిమ ద్రవించిపోతున్నట్లు గ్రహించి వెంటనే దీపము వెలిగించినాడు. తీక్ష్ణమైన దీపకాంతిలో స్వాప్నికజాడ్యము వదలిపోయినది. అంతట ఇందులేఖను కాళ్లమీద కొట్టి లేపినాడు.

ఇందులేఖ కలవరముతో లేచినది. ఆ గాబరాలో చెదరిన చీరెచెంగులు, పయటచెంగు ఆమె సర్దుబాటుకు ఎదురుతిరిగినవి. ఎంతో ప్రయత్నముమీద సవరించుకొని ఒక్కసారి భర్తవంక క్రీగంట చూచి ఆమె తల వంచుకొన్నది.

శ్రీనివాసరావు, "ఇందులేఖా!"అని పిలిచినాడు.

ఇందులేఖ ఒక్కనిముసముమాత్రము పతివంక ఓరచూపు చూచి మళ్లీ తల వంచుకొన్నది.

"ఇందులేఖా! ఇవాళ నిన్నెందుకు పిలిచినానో తెలుసునా?"

ఇందులేఖ తెలియదన్నట్లు తల ఆడించినది.

"అయితే విను: నీవు నాతో కాకినాడ రావలెను. వస్తావా?"

ఇందులేఖ మాట్లాడలేదు.

"ఏమిటె, వస్తావా?"

ఇందులేఖ మృదుస్వరముతో "మీరు ఎక్కడికి తీసుకపోతే అక్కడికి వస్తాను"అన్నది.

"మా నాన్నగారితోను, అమ్మగారితోను చెప్పకుండా, వారి అనుమతి లేకుండా రావలెను. రాగలవా?"

ఇందులేఖ పలుకలేదు.

"సమాధానము చెప్పు. ఇది సిగ్గుపడవలసిన సమయము కాదు. రాగలవా? చెప్పు."

"పెద్దలకు తెలియకుండా ఎందుకు? వారి అనుజ్ఞ తీసుకొనేపోవచ్చునుగదా! వారికిమాత్రము అభ్యంతరము ఏ ముంటుంది?"

"నిన్ను వెంట తీసుకపోవడము మా నాయనగారికి ఇష్టములేదు. ఆయన ఏమంటున్నారంటే—'వాడికి బుద్ధి స్థిరముగా ఉంటేగదా! వాడు ఎలాగో భ్రష్టైపోయినాడు. పోతే పోనీ! కులవధువును ఫేస్ పౌడర్లు వేయించి బూట్సులు తొడిగించి బ్రహ్మసమాజానికి తీసుకపోతాడుగదా! అది నా గొంతులో ఊపిరిఉండగా జరుగనీయను' అని."

"మీరు నన్ను నిజముగా బ్రహ్మసమాజానికి తీసుకుపోతారా ఏమిటి?"

"మన మిద్దరము పవిత్రమైన బ్రాహ్మధర్మమందు దీక్షితుల మవుదాము."

ఇందులేఖ ప్రమాదము తెలిసికొన్నది. భర్త ఎంత నిగూఢముగా ప్రవర్తిస్తున్నాడో గ్రహించినది. అప్పుడామె, "నేను విష్ణుమూర్తిని భగవంతునిగా విశ్వసిస్తున్నానుగదా! మరి నేను బ్రహ్మజ్ఞానిని ఎలా కాగలను?" అని పలికినది.

అప్పుడు శ్రీనివాసరావు యథోచితగాంభీర్యము వహించి ఇలా అన్నాడు: "ఆ విశ్వాసమంతా నీవు వదలిపెట్టవలసిఉంటుంది. అది అంతా భ్రాంతి. నేను ఎందుకని ఏకేశ్వరుని విశ్వసిస్తున్నాను?"

"మీరు చదువుకొన్నవారు. నాకు అంత జ్ఞానమున్నదా మరి?"

"నీకుకూడా చదువు చెప్పిస్తాను. అక్కడికి వెళ్లినతరువాత అన్ని ఏర్పాట్లు చేస్తాను. ఆడవాళ్ల స్కూలులో చేర్పిస్తాను."

ఇందులేఖ అసమ్మతిసూచకముగా కంఠ మొరగా వంచి, "నేను చదువు నేర్చుకోవలసిఉంటే మీ దగ్గరనే నేర్చుకొంటాను. ఇంత పెద్దదాననైనతరువాత తగుదునమ్మా అని బడికి వెళ్లలేను" అన్నది.

శ్రీనివాసరావు కొంచెముసేపు ఆలోచించి తరువాత ఇలా అన్నాడు: "నీవు పొరపాటుపడుతున్నావు. అక్కడ మన మిద్దరము కలిసి ఒక్క ఇంట్లో ఉండడము తటస్థించదు."

ఇందులేఖ ఆశ్చర్యముతో, "అయితే నేను ఉండడము మరి ఎక్కడ?" అన్నది.

"ఆ స్కూలులోనే. అక్కడ అంతా ఆడవాళ్లే. ఉండడము, చదువుకొనడము అంతా అక్కడే! అక్కడ సమస్తమైన వసతులు ఉన్నవి."

ఇందులేఖ స్థిరస్వరముతో, "అయితే నేను రాను!" అన్నది.

శ్రీనివాసరావు వ్యాధి ఉన్నచోట చికిత్స జరగడములేదని తెలిసికొన్నాడు. ఉన్న విషయమంతా విప్పిచెప్పడము ఆవశ్యక మనుకొన్నాడు. అప్పుడతను ఇలా అన్నాడు: "నేను ఇన్నాళ్లనుంచి నిన్ను చూడకుండా, నీవద్దకు రాకుండా ఉన్న కారణ మేమిటో తెలిసికొన్నావా?"

"కొంచెముగా విన్నాను. కాని బాగా తెలియలేదు."

"అయితే విప్పిచెప్పుతాను: ప్రథమతః మన వివాహము పరస్పరానురాగఫలితము కాదు. ద్వితీయతః ఆ వివాహానుష్ఠానము విగ్రహారాధనమతప్రకారము జరిగినది. ఈ రెండు కారణాలవల్ల మనకు వివాహసిద్ధి కాలేదని నా మతము. అందుచేత నీవు నాకు భార్యవు కావు—చెల్లెలివంటిదానవు. తెలిసినదా?"

"ఊఁహూఁ!"

"అట్లయితే ఒక్క విషయము విస్పష్టముగా చెప్పుతున్నాను: నేను నిన్ను ప్రేమించడము లేదు."

"అది కనబడుతూనే ఉన్నది."

"నేను ఇంకొక యువతిని ప్రేమిస్తున్నాను."

"అయితే, నన్ను కాకినాడకు తీసుకపోయి ఏమి చేస్తారు?"

"చూడు, ఇందులేఖా! చిన్నతనములో— ఏమీ తెలియని రోజులలో నిన్ను వివాహమాడినాను. అందువల్ల నీ విషయములో చాలా అధర్మ మాచరించినాను. అందుకని నీ జీవితశేషము నిష్ఫలము చేసి ఇంకా నిన్ను అధోగతిపాలు చేయను. మన మిద్దరము బ్రాహ్మధర్మము అవలంబిస్తే మనము మన వివాహబంధము ఛేదించుకోవచ్చును. అప్పుడు నీకు స్వాతంత్ర్యము లభిస్తుంది. తరువాత నీవు నీఇష్టము వచ్చినవానిని పెండ్లిచేసుకోవచ్చును. కనుక అక్కడికి వెళ్లితే మన మిద్దరము ఒక్కచోట నివసించడము అసంభవము. ఇప్పుడంతా స్పష్టముగా తెలిసినదా?"

ఇందులేఖ సమాధానము చెప్పలేదు. ప్రశ్నలు కూడా వేయలేదు. మరింత తల వంచుకొని దారువిగ్రహములాగా కూర్చున్నది. కొంతసేపటికి ఆమె ఏడుస్తున్నదని శ్రీనివాసరావు తెలిసికొన్నాడు. అందుకు అతని మనస్సు కష్టపడినది. ఒక్కసారి ఆమెగడ్డము పట్టుకొని తల ఎత్తి కన్నీళ్లు తుడిచివేతా మనుకొన్నాడు. కాని కర్కశమైన కర్తవ్యజ్ఞానము అతని ఉద్దేశమునకు అభ్యంతరమైనది. అంతరాత్రివేళ నిర్జన గృహములో ఒకానొక యువతిని స్పృశించడము అతనికి యుక్తిసంగతముగా కనబడలేదు. అందుచేత అతను ఏమీ చేయకుండా ఊరక ఇలా అన్నాడు: "ఇందులేఖా! ఎందుకు ఏడుస్తావు? నీసౌభాగ్యముకోసమే కదా నేను చెప్పినదంతా!"

కాని ఇందులేఖ మాట్లాడలేదు. ఏడుపుకూడా ఆపలేదు. "ఇందులేఖా!" అని అతను పిలిచినాడు. ఈసారి అతని కంఠస్వరము మారినది. అందులో ఆదరాతిశయము ధ్వనించినది. ఆ స్వరము విని ఆమె మరింత ఎక్కువగా ఏడువసాగినది.

శ్రీనివాసరావు ఆశ్చర్యముతో ఇలా అనుకొన్నాడు: "ఈమాటకీమెకు ఇంత కష్టము, ఇంత దుఃఖము ఎందుకో! ముందు కలుగబోయే మహానందము ఆమెమనస్సుకు ఎందుకు స్ఫురించలేదో! నేను ఆమెను ప్రేమించడము లేదు; ఇక ప్రేమించలేను కూడా! ఆ సంగతి విప్పిచెప్పినాను. ఈ బంధము తెంచుకొంటే జీవితములో సుఖమైన మార్గము అవలంబించడానికి అవకాశము కలుగుతుందిగదా! అట్టి ప్రస్తావము

చేసినాకూడా ఎందుకో అంత దుఃఖము! అయితే ఆమె నన్ను ప్రేమిస్తున్నదా ఏమిటి చెపుమా!"

ఆ సమయములో గడియారము ఠంగ్ ఠంగ్ మని మూడు గంటలు కొట్టినది. ఇందులేఖ లేచి, "ఇక నేను వెళ్లుతాను" అన్నది.

శ్రీనివాసరావు చటుక్కున ఆమెచేతులు పట్టుకొని "ఇందులేఖా! నీమనస్సులోని మాట నాకు స్పష్టముగా చెప్పవూ!" అని అడిగినాడు.

ఇందులేఖ కంపితస్వరముతో, "ఇప్పుడు నాకు మనస్సు సరిగా లేదు" అన్నది.

"అయితే రేపు రా; వస్తావా?"

"చూస్తాను."

"చూడడము కాదు, ఇందులేఖా! తప్పకుండా రా."

అతని స్వరములో ఆతురత ధ్వనించినది. "అలాగే" అని ఆమె వెళ్లిపోయినది.

## 3

మరునాడు శ్రీనివాసరావుకు మెలకువ వచ్చేసరికి చాలా ప్రొద్దు ఎక్కినది. తెలివి రాగానే ఇందులేఖ అశ్రుపూర్ణనయనము లతని మనోనేత్రమునకు ప్రత్యక్షము లైనవి. లేచి కూర్చున్నాడు. ప్రక్క మీద బంగారు జడసూది కనిపించినది. వెంటనే దానిని పెట్టెలో భద్రపరచినాడు.

ప్రాతఃకాలమందు శ్రీనివాసరావు ఈశ్వరోపాసనా, ఈశ్వరసంకీర్తనమూ చేస్తూ ఉండేవాడు. ఇదివరకు ఎన్నడూ వాటికి అభ్యంతరము కలుగలేదు. కాని నేడుమాత్రము అవి సాగలేదు. నేడు అతని మనస్సు చాలా ఉద్వేజిత మైనది.

గ్రామముబయటికి వెళ్లి శ్రీనివాసరావు తల వంచుకొని ఏటిఒడ్డున పచారుచేస్తున్నాడు. కొంతసేపైన తరువాత తల ఎత్తి చూచినాడు. తన ఇంటి నౌకరు రామన్న చేల కడ్డము పడి పరుగెత్తుతూ తన వైపే వస్తున్నాడు. అతనిని చూడగానే హఠాత్తుగా అమంగళాశంక కలిగి శ్రీనివాసుని మనస్సు ఉద్విగ్న మైనది. "ఏమి సంభవించినది చెపుమా! ఇతను నన్ను పిలుచుకపోవడానికి రావడము లేదుగదా! ఇందులేఖకు ఏమీ ప్రమాదము తటస్థించలేదుగదా! ఆమె ఏదైనా దుస్సాహసికకార్యము చేసి ఉండదుగదా!" అని భావించినాడు.

రామన్న ఏడుస్తూ దగ్గరకు వచ్చినాడు. శ్రీనివాసరావు కంగారుతో, "ఏమిరా, రామన్నా! ఏమి జరిగినది?" అని అడిగినాడు.

రామన్న పొంగివచ్చే దుఃఖము మింగుతూ, "ఇంకేమున్నది, చిన్నదొరా! కొంప కూలిపోయినది. మంత్రగానిని పిలుచుకరాబోతున్నాను. పెద్ద కాటు వేసినది" అని చెప్పుతూ వెళ్లిపోయినాడు.

కాటు అంటే పాముకాటు. శ్రీనివాసరావు ఇందులేఖకు పాము కరచిన దనుకొన్నాడు. ఎవరిని కరచినది అని అడిగేలోపలనే రామన్న దూరము పోయినాడు.

శ్రీనివాసరావు వెంటనే ఇంటికి మరలినాడు. మొదట సహజముగా నడచినాడు. క్రమముగా నడక త్వరితమైనది. చివరకు అతను పరుగెత్తడము ఆరంభించినాడు.

సింహద్వారముగుండా గృహములోనికి రావడానికి కొంచెము చుట్టు తిరిగి రావలెను. అందుచేత శ్రీనివాసరావు తోటవాకిలిగుండా లోపలికి ప్రవేశించినాడు. చెట్లసందుగా గృహము సమీపిస్తూ ఉండగా కొంచెముదూరములో ఇందులేఖా, వరలక్ష్మి కనిపించినారు. వాళ్లు పూలమొక్కలకు నీళ్లు పోయబోతున్నారు. అతను వాళ్లను చూచి దీర్ఘనిశ్శ్వాసము విడచి మనశ్శాంతి పొందినాడు. ఇందులేఖముఖము విచారముగా ఉన్నది. వరలక్ష్మి నేత్రాలు కౌతుకపూర్ణములు. మొదట వాళ్లు అతనిని చూడలేదు. సమీపమునకు వచ్చినతరువాత చూచినారు. ఇందులేఖ తొట్రుపాటుతో పైట సర్దుకొన్నది. వరలక్ష్మి నవ్వినది. ఆమెనవ్వు అతనిని ఎగతాళిచేస్తున్నట్లున్నది. ఆమె నేత్రములు, 'తెలిసినదిలే, నీసంగతి అంతా మాకు తెలిసినదిలే' అంటున్నట్లున్నవి.

"వరలక్ష్మీ! ఎవరిని పాము కరచినది?" అని అడిగినాడు శ్రీనివాసరావు.

"పాము కరచినదా? ఎవరిని? మాకు తెలియ లేదే!" అన్నది ఆశ్చర్యముతో వరలక్ష్మి.

శ్రీనివాసరావు ముందు సావడిలోనికి వెళ్లి రామన్న భార్యను పాము కరచిన దని తెలిసికొన్నాడు. వెంటనే రామన్న ఇంటికి వెళ్లినాడు. అక్కడ చాలా మంది గుమిగూడి ఉన్నారు. మాంత్రికులు ఒకనితరువాత ఒకరు ఉచ్చైస్స్వరముతో మంత్రాలు పెట్టుతున్నారు. కాని ఆ సర్పదష్టకు అవి ఏమాత్రమూ ఉపకరించలేదు. రామన్న మాంత్రికుని తీసుకవచ్చేసరికి అంతా అయి పోయినది. అప్పుడు రామన్న ఎంత ఏడ్చినాడో చెప్ప శక్యము కాదు. అయిదారేండ్ల పిల్లవానిలాగా నేల మీద పడి దొర్లుతూ ఏడ్చినాడు. అతని దుఃఖము చూచి 'అయ్యో పాపము, అయ్యో పాపము' అని కొందరు కంట నీరు పెట్టుకొన్నారు. కొందరు అది చూడలేక కళ్ల నీళ్లు కారుస్తూ వెళ్లిపోయినారు. శ్రీని వాసరావు కళ్లనీళ్లు తుడుచుకొని గృహాభిముఖుడైనాడు. నడుస్తూ అతను లోలోపల ఇలా అనుకొన్నాడు:

"అశిక్షితమూ, అసంస్కృతమూ అయిన ఒకా నొక కర్షకుని హృదయములో ఇంత అనురాగమా! పూర్వరాగవర్జితముగా మంత్రపూర్వకముగా జరిగిన వివాహములో అనురాగము జన్మించడము అసంభవ మన్నాడే రఘుపతి! అతనిని తీసుకవచ్చి ఒక్కసారి ఈ దృశ్యము చూపిస్తే బాగుండును!"

ఇంటికి చేరేసరికి రఘుపతివద్దనుంచి ఉత్తరము వచ్చినది:

"సత్యమేవ జయతి!

కాకినాడ,
జ్యేష్ఠ శు ౨ సోమవారము.

ప్రియసోదర!

నిన్న నేను వ్రాసిన ఉత్తరము అంది ఉంటుంది. గోవిందవరం జమీన్దారు మహారాజరాజశ్రీ నర సింహప్రసాద్ బహదూర్‌వారు తమ కుమారునికి చదువు చెప్పడానికి ఉపాధ్యాయుడు కావలె నని అన్వేషిస్తున్నారు. సాయంకాలము రెండు గంటలసేపు పాఠము చెప్పవలెను. వేతనము అరవై రూపాయలు. ఆ సంగతి విని నేను వారి దర్శనము చేసినాను. ఆ పద విలో నిన్ను నియోగించుకుంటే చాలా సంతృప్తి పొందగలరు అని వారితో చెప్పినాను. శ్రీవారు అంగీ కరించినారు.

నీకు సమ్మతమైతే ఒక వారము పదిరోజులలో నీవు ఆ పనిలో ప్రవేశించవలసి ఉంటుంది. కనుక ఈ ఉత్తరము అందినవెంటనే వెనుకటి ఏర్పాటు ప్రకారం శ్రీమతి ఇందులేఖను వెంటబెట్టుకొని బయలుదేరి రావలెను. నీ ప్రత్యుత్తరము చూచుకొని మహిళా విద్యాలయములో శ్రీమతికోసము తగిన ఏర్పాటు చేస్తాను.

శైలబాల వచ్చినది. రాగానే నిన్నుగురించి అడిగినది. ఆమెకు నీమీద ప్రేమ దినదినాభివృద్ధి పొందుతున్న దనుటకు సందేహము లేదు. సోదరి ఇందు లేఖను తీసుకవచ్చే విషయములో నీవు ఏమాత్రము అన్యథా శంకించనక్కరలేదు. ఏదైనా అభ్యంతరము కలిగే పక్షములో ఒక్క సంగతి జ్ఞాపక ముంచుకో: ప్రపంచములో శుభకార్య మేదైనా సాధించవలసి వచ్చినపుడు అనేకాటంకములు అతిక్రమించవలసి ఉంటుంది అని. జీసెస్ తన ప్రియధర్మము ప్రచారము చేయడముకోసము ప్రాణాలు అర్పించడానికి కూడా సందేహించలేదు. సర్వమంగళవిధాత నీకు సర్వథా సర్వదా సాయపడును గాక!

భవదీయః
రఘుపతి."

శ్రీనివాసరావు రఘుపతిఉత్తరానికి ప్రత్యుత్త రము వ్రాయలేదు. అతనికి మాటిమాటికి ఇందులేఖ బాష్పాక్రాంతవదనము ప్రత్యక్షము కాసాగినది. ఆమెకు ఏమాత్రము ఇష్టము లేదు. పైన ఆమె ఎంతో దుఃఖపడుతున్నది. అందుచేత అతను ఆమెను ఏ విధ ముగా కాకినాడ తీసుకపోతాడు!

నేటి ఉదయము రామన్న వ్యవహారము చూచిన తరువాత శ్రీనివాసరావు మతవిశ్వాసము కొంచెముగా సంచలించినది. ఇందులేఖ అతనిని బాగా ప్రేమించి ఉంటుంది. లేకపోతే వివాహబంధము ఛేదించుకొనడము అనే ప్రసంగము వచ్చేసరికి ఆమె కంత దుఃఖమెందుకు కలుగుతుంది ? వివాహమునకు పూర్వమే అన్యోన్యానురాగము కలుగవలెగాని, తరువాత అట్టిది కలుగదనే విషయములో అతని మనస్సుకు చాలా సంశయము కలిగిపోయినది.

సాయంకాలము అతని అన్నకుమారుడు గబగబ వచ్చి కవరు ఇచ్చి పరుగెత్తుకపోయినాడు. కవరు అతికించి ఉన్నది. చిరునామా లేదు. అతను కవరు చింపి ఉత్తరము చదువుకొన్నాడు. అందులో ఇలా ఉన్నది:

"ప్రాణేశ్వరా !

మీరు నన్ను ఎక్కడికి తీసుకపోతే అక్కడికి రావడానికి సిద్ధముగా ఉన్నాను. ఫలానా సమయములో అని తెలియజేస్తే ఆవేళకు నేను మీవెంట బయలుదేరుతాను. నేటిరాత్రికి రాలేను. క్షమించ గోరుతున్నాను.

మీ చరణదాసి,

ఇందులేఖ."

ఉత్తరము చదువుకొని శ్రీనివాసరావు విపరీతముగా ఆశ్చర్యపడినాడు. రావడానికి సిద్ధముగా ఉన్నదా ? అయితే వివాహబంధము ఛేదించుకొనడానికి విచారపడడము లేదన్నమాట ! ఆ నాలుగు పంక్తులూ మళ్లీమళ్లీ చదువుకొన్నాడు. విచారము లేకపోతే ప్రేమించడము లేదన్నమాటా ? అయితే 'ప్రాణేశ్వరా', 'మీ చరణదాసి'అనే మాటలు ఎందుకు వ్రాసినది ? వాటికి అర్థ మేమిటి ? 'అవి ఉత్తపడికట్టుమాటలు—వాటికి మరి పెద్దఅర్థము ఏమీ ఉండదు' అనే సిద్ధాంతానికి వచ్చేసరికి అతని హృదయములో జ్వాల ప్రారంభమైనది.

అయితే ఆ జ్వాల ఒక్కక్షణముమాత్రమే. శ్రీనివాసరావు తన మనస్సును రెండుగదుములు గదిమినాడు: "ఆమె నిన్ను ప్రేమించడము లేదనుకో. అందువల్ల నీకు కలిగిన నష్ట మేమిటి?" అని ప్రశ్నించుకొన్నాడు. "లేదు. అందువల్ల నా కేమాత్రము వ్యథ లేదు" అని మనస్సు బదులు చెప్పినది. అప్పుడతను భావనావిర్భూతమైన శైలబాలామూర్తిని అత్యంతాదరముతో హృదయఫలకమున చిత్రించుకొన్నాడు.

తరువాత అతను ఇలా ఆలోచించినాడు: "ఇక ఒక్కదినముకూడా ఆలస్యము చేయరాదు. రేపే ఇందులేఖను తీసికొని కాకినాడకు ప్రయాణము కావలెను. రాత్రి ఒంటిగంటకు ఇంటినుంచి బయలుదేరాలె. తాళ్లూరు ఇక్కడికి రెండు క్రోసులు. ఈ కొంచెముదూరము మెల్లగా నడచిపోతే ఇక్కడివారి కెవ్వరికీ తెలియకుండా ఉంటుంది. తాళ్లూరునుంచి బండి చేసుకొని చెరువూరుమీదుగా వెళ్లితే పది కోసులు. పెండ్యాలమీదుగా వెళ్లితే పండ్రెండు కోసులు. అయినా పెండ్యాలమీదుగా వెళ్లడమే మంచిది. కొంచెము చుట్టుఅయినా మార్గములో గ్రామాలెక్కువగా తగులవు. అందుచేత జనుల కంటబడకుండా పోవచ్చును. మధ్యాహ్నానికి కోలవెన్ను చేరి భోజనము చేసుకొని రాత్రికి హంసవరము చేరవచ్చును. హంసవరములో రైలెక్కితే సులభముగా కాకినాడ చేరవచ్చును. ఇలా ప్రయాణించడమువల్ల ఎక్కువ ఆలస్యమవుతుంది. అయితేమాత్ర మేమి? నలుగురికి తెలియకుండా ఉంటుంది. కనుక ఇలా పోవడమే మంచిది."

ఆరాత్రి అంతా శ్రీనివాసరావుకు నిద్ర పట్టలేదు. భవిష్యజ్జీవితవిషయమునకు సంబంధించిన నానావిధ కల్పనలతో అతని శిరస్సు వేడెక్కిపోయినది. మరునాడు ప్రాతఃకాలమున ఇందులేఖకు ఇలా వ్రాసినాడు:

"ప్రియసోదరికి,

నేటిరాత్రి ఒంటిగంటకు ప్రయాణమై నా గదికి రావలెను. ఇంకొక చీరె తప్ప మరి సామాను లేవీ తీసుకరావద్దు. కావలసిన వన్నీ అక్కడ ఏర్పాటు చేస్తాను.

శ్రీనివాసరావు."

రాత్రి ఒంటిగంటకు శ్రీనివాసరావు రహస్యముగా భార్యను తీసుకపోయినాడు.

## ౪

మధ్యాహ్నము పండ్రెండు గంటలకు మండు టెండలో చెమటలు దిగగారుతూ ఇందులేఖా, శ్రీనివాసరావులు కోలవెన్నుసత్రముముందు బండి దిగినారు. శ్రీనివాసరావు బండివానికి బాడుగ ఇచ్చి భార్యతో సత్రములోపలికి వచ్చినాడు. సత్రపు గుమాస్తా వచ్చి వారికి వసతి చూపించినాడు. శ్రీనివాసరావు గుమస్తాకు డబ్బు ఇచ్చి భోజనసామగ్రి తెచ్చిపెట్టవలసిన దని కోరినాడు. గుమాస్తా బజారుకు వెళ్లినాడు.

సత్రమువెనుక పెద్ద కోలను ఉన్నది. కోలను లోని జలము నిర్మలమైనది. ఇందులేఖ ఎండదెబ్బకు ఉడికిపోయినది. ఆమెకు విపరీతమైన దప్పిక అవుతున్నది. అయినా ఆమె విశ్రాంతి తీసుకోలేదు. ఒంటిచెమట ఆరకముందేఆమె స్నానము చేయబోయినది. శ్రీనివాసరావు తొందరగా స్నానముచేసి హంసవరానికి బండి మాట్లాడబోయినాడు.

గుమస్తా భోజనసామగ్రులు తెచ్చేసరికి ఒంటిగంట అయినది. అంతవరకు ఇందులేఖ గ్రీష్మతాపము శమించుటకై స్నానము చేస్తూనేఉన్నది. భోజనసామగ్రులు రాగానే ఆమె స్నానము ముగించి బయటికి వచ్చి ఒడలు తుడుచుకొని వంట ప్రారంభించినది.

ఎండదెబ్బ తగిలినమీద అంతసేపు నీళ్లలో నాని నందుకు ప్రతిఫలము త్వరలోనే కలిగినది. వంట పూర్తి అయీ కాకముందే ఆమెకు జ్వరము ప్రారంభమైనది. శ్రీనివాసరావు తిరిగి వచ్చేసరికి ఇందులేఖ చలిజ్వరముతో గడగడ వణకిపోతున్నది. తాకి చూడగా ఆమె శరీరము మండిపోతున్నది. కన్నులు జపాపుష్పముల వలె ఎర్రబడినవి. పడుకొనడానికి పరుపుగాని, జంపఖానాగాని వెంట తీసుకరాలేదు. కప్పడానికి దుప్పటిగాని, ఇతరవస్త్రముగాని లేదు. ఇప్పు డతను ఆమెను ఎక్కడ పడుకోబెట్టుతాడు? ఏమి కప్పుతాడు? అప్పు డతను ఇలా అన్నాడు: "నే నిప్పుడే బజారుకు వెళ్లి జంపఖానా దుప్పట్లు కొనితెచ్చి నీకు పక్క అమరుస్తాను."

"ముందు మీరు భోజనముచేయండి. మీకు వడ్డిస్తాను. నేను తరువాత పడుకొంటాను లెండి."

"పిచ్చిదానా! అంత జ్వరముతో అన్నము వడ్డిస్తావా! నీవు అలా బాధపడుతూఉంటే నాకు మాత్రము అన్నము రుచిస్తుందా?"

ఇందులేఖ వణకుతూ వణకుతూ ఇలా అన్నది:

"నాబాధ కేమిలెండి? అందుకని మీరు ఉపవాసముచేస్తారా? చాలు, చాలు! ఈ ఒక్కరోజుకే మీ మొగమంతా చిక్కిపోయి నల్లబడినది."

శ్రీనివాసరావు ఆమెకు సమాధానము చెప్పకుండా బజారుకుపోయి జంపఖానా, రెండు దుప్పట్లు, పచ్చడము తెచ్చి పక్కవేసి ఇందులేఖతో, "వచ్చి పడుకో, పచ్చడము కప్పుతాను" అని అన్నాడు.

"అ దేమిటి? మీరు భోజనము చేయనిది నేను పడుకోను" అన్నది ఇందులేఖ.

ఆ మాటలు వినకుండా అతను ఆమెను రెక్కపట్టుకొని తీసుకవచ్చి పడుకోబెట్టినాడు. ఆమె పడుకొని రెండుమూడుసార్లు "అన్నము పెట్టుకొని భోజనము చేయండి. చల్లారితే మీరు తినలేరు" అని హీనస్వరముతో అతనిని బలవంతముచేసినది. తరువాత జ్వరగతి మరింత తీవ్రము కావడముచేత ఆమెకు స్మృతి తప్పినది.

* * *

మూడురోజు లైన తరువాత ఇందులేఖకు స్మృతి వచ్చినది. కనులు తెరచి చూచినది. భర్త ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. అపుడు శ్రీనివాసరావు "ఇందూ! ఎలా ఉన్నది ఇప్పుడు?" అని అడిగినాడు. ఇందులేఖ "నెమ్మదిగానే ఉన్నది. సరేగాని, మీరు భోజనము చేసినారా?" అంటూ అటూ ఇటూ చూచినది. అది సత్రపుగది కాదు. తాను మంచముమీద పడుకొనిఉన్నది. అప్పు డామె, "ఇ దేమిటి? ఇపుడు నేను ఎక్కడ ఉన్నాను?" అని అడిగినది.

"ఇందూ! నీవు మళ్లీ ఇలా మాట్లాడుతుండగా వింటానని అనుకోలేదు. మూడురోజులు కడచిపోయినవి. ఈఊళ్లో మాణిక్యారావుగారు అనే పిల్లజమీందారు ఉన్నాడు. వారి మేడ ఇది."

"మూడు రోజులే!"

"అవును, ఇందూ! మూడురోజులు నీవు స్మృతి లేకుండా పడిఉన్నావు. ఇక నీకు వ్యాధి నిమ్మళిస్తే అంతా సార్థక మవుతుంది."

ఇందులేఖ కొంచెముసేపు నిశ్శబ్దముగా ఉండి, తరువాత, "మీకు ఒక్కమాట చెప్పతాను" అన్నది.

"ఏమిటి, ఇందూ!"

"నన్ను బ్రతుకనీయవద్దు."

ఆ మాట వినగానే శ్రీనివాసరావు వలవల కన్నీరు కారుస్తూ, "ఛీ, ఇందూ! ఏమిటి ఈ పిచ్చి మాటలు? నీకు జబ్బు నయ మవుతుంది. నీవు బ్రతుకు తావు" అన్నాడు.

ఇందులేఖ పెదవులు కంపించినవి. కనుల నీరు క్రమ్మినది. భర్తవంక రెప్ప వేయకుండా చూస్తూ గద్గదికతో, "నేను బ్రతికి ఏమి ప్రయోజనము! నన్ను దాటి పోనీయండి" అన్నది.

"కాదు, ఇందూ! నిన్ను దాటిపోనీయలేను."

"ఈ వ్యథురాలిని పెట్టుకొని ఏమి చేస్తారు?"

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను, ఇందూ!"

రోగిణిదుర్బలహృదయము ఆవేగభరము ఇక సహించలేకపోయినది. కన్నులు మూసుకపోయినవి. శరీరము అవశమై కంపించినది.

కొంచెముసేపటికి డాక్టరు వచ్చినాడు. శ్రీనివాసరావు విప్పారిన ముఖముతో, చిరునవ్వుతో నమస్కారము చేసి, "డాక్టరుగారూ! మీరు ఉదయము పదిగంటలకు ఇచ్చిన మందు చాలా అద్భుతముగా పని చేసినది. స్మృతి కలిగినది. పది నిముసాల క్రిందట కొంచెముగా మాట్లాడినది" అని చెప్పినాడు.

అపుడు డాక్టరు ఇలా అన్నాడు: "అయితే ఇక భయము లేదు. ఈ జ్వరము ఇక రెండు మూడు రోజులలో జారిపోతుంది. కాని ముందు మీరు చచ్చిపోయేటట్లున్నారు. మూడురోజుల బట్టి నిద్రాహారాలు లేకుండా అదేమాదిరిగా పీఠము వేసుక కూర్చున్నారు. మీవలె భార్యను ప్రేమించేవాళ్లను చాలా తక్కువ మందిని చూచినాను."

శ్రీనివాసరావు లోలోపల "చాలా తక్కువ మంది అనే మాట నిజమే!" అనుకొని, ప్రకాశముగా "నాభార్యగనుక నేను స్వభావతః ఏలాగో ప్రేమిస్తానని అనుకోండి. కాని మీరు చూపించిన సౌహృదము మాత్రము సాటిలేనిది" అన్నాడు.

ప్రవీణుడైన డాక్టరు ఆత్మప్రశంసకు కొంచెము సంకోచిస్తూ, "నేనుమాత్రము ఎక్కువ ఏమి చేసినాను? నేను ఏకొంచెము చేసినానో అది నా విధి; నా వృత్తిధర్మము!" అన్నాడు.

"మీరు ఎంతో ఆదరముతో మాణిక్యారావు గారితో చెప్పి, వారి ఉద్యానగృహము ఖాళీచేయించి ఇప్పించకపోతే, ఆ సత్రపు గదిలో ఎగుడు దిగుడు చెమ్మ నేలమీద జంపఖానాపక్కపైన పడుకొని నా భార్య ఎన్నిరోజులు జీవించి ఉండేది!"

డాక్టరు ఆ ప్రసంగము మార్చి అన్యప్రసంగము తెచ్చినాడు. తరువాత ఔషధము, పథ్యము మొదలైన విషయాలు చెప్పవలసినవి అన్నీ చెప్పి వెళ్లిపోయినాడు.

ఆ రాత్రి పది గంటలకు ఇందులేఖకు జ్వరము తగ్గినది. ఆరాత్రి అంతా ఆమె సుఖముగా నిద్రపోయినది. శ్రీనివాసరావుకూడా నిశ్చింతగా నిద్రపోయినాడు.

౫

మరునాడు ఉదయము డాక్టరు వచ్చినాడు. ఇందులేఖ అతనిని చూచి చీరె సవరించుకొని ముఖము వంచుకొన్నది. జ్వరము పూర్తిగా తగ్గిపోయిన దని విని సంతోషముతో డాక్టరు, "ఇక ఏమాత్రము భయము లేదు. ఆమెమనస్సు ఇకముందు ఎక్కువ ప్రసన్నముగా ఉండేటట్లు చూడవలెను. ఔషధము కంటెకూడా అది అత్యావసరము సుమా!" అని చెప్పి వెళ్లిపోయినాడు. తరువాత శ్రీనివాసరావు డాక్టరు చెప్పిన ప్రకారము ఇందులేఖకు ఔషధము, ఆహారము ఇచ్చినాడు. పిమ్మట ఇద్దరికి కబుర్లు ఆరంభమైనవి.

"ఇన్నిరోజులనుంచి ఎక్కడ భోజనము చేస్తున్నారు?" అని అడిగినది ఇందులేఖ.

"డాక్టరుగారి ఇంటినుంచి భోజనము వస్తున్నది."

"అయితే, ఆకారమంతా అలా ఉన్నదేమి? చిక్కి సగమై నల్లబడిపోయినారే! మీ కష్టానికంతా కారణము నేను. నాకోసము ఎందుకింత కష్టపడుతున్నారు?"

శ్రీనివాసరావు చిరునవ్వుతో, "నాకు జబ్బు చేస్తే నీవుమాత్రము నాకోసము మరి కష్టపడవా?" అన్నాడు.

ఇందులేఖ పక్కవంక చూస్తూ, "ఇప్పుడు జబ్బు కోరుకోనక్కరలేదులెండి"అన్నది మెల్లమెల్లగా.

శ్రీనివాసరావు ఇందులేఖహస్తము గ్రహించి సాదరముగా దువ్వుతూ, "కోరుకోను. కాని నాకు జబ్బు చేస్తే నీవు కష్టపడతావా, లేదా?"అని అడిగినాడు.

"పడకేమి?"

"ఎందుకోసము?"

ఇందులేఖ బాష్పరుద్ధస్వరముతో, "మీరు నా ప్రాణేశ్వరులు కనుక!" అన్నది.

శ్రీనివాసరావు ఆమెహస్తము మృదువుగా దువ్వుతూ, "నీవు నాభార్యవు కనుక!"అన్నాడు.

ఇందులేఖ సస్మితవదనముతో, "ఎప్పటినుంచి?" అన్నది.

"నిన్ను ప్రేమించిననాటినుంచి."

ఆమె కొంచెముసేపు ఊరకుండి, "మీరు బ్రాహ్మణులు కదా! బ్రాహ్మలు అసత్యమాడరని విన్నాను" అన్నది.

"వారమురోజులక్రిందటివరకు నేను బ్రహ్మనే."

"ఇప్పుడో?"

"ఇప్పుడు అయినా కాకపోయినా నేనసత్యము పలుకను. నేను నిన్ను నిజముగా ప్రేమిస్తున్నాను."

"అయితే ఆనాడు ప్రేమవిషయము చెప్పినారే—అదేనా?"

శ్రీనివాసరావు నిరుత్తరుడై కొంతసేపటికి, "నీవు నన్ను ప్రేమించడము లేదు"అన్నాడు.

"ఎలా తెలిసినది?"

"ఎలాగా? మన వివాహబంధము ఛేదించుకొనడానికి నీవు అంగీకరించినావు. అందుకనే నీవు కాకినాడ రావడానికి సమ్మతించినావు!"

ఇందులేఖ నవ్వుతూ, "ఇదేనా మీరు తెలుసుకొన్నది?"అన్నది.

"అయితే మరి ఏమిటి?"

"నాఅంతట నేను బుద్ధిపూర్వకముగా వచ్చినాననుకొన్నారా? నన్ను పెద్దవదినగారు పంపించినది."

"నీవు ఇంకొకరిని పెండ్లాడడము ఆమెకు ఇష్టమూ, సంతోషమూనా?"

"అవును. వరునికూడా స్థిరపరచినది."

"ఎవరు?"

"యమధర్మరాజు!"

శ్రీనివాసరావు పకపక నవ్వినాడు.

"వదినగారు ఏమని చెప్పినారంటే—తండ్రిగారి ఇంటినుంచి నామరది నిన్ను ఎలా దొంగిలించుకొనిపోతున్నాడో అలా నీవు మార్గములో ఆయన మనస్సు దొంగిలించుకోవాలె. లేకపోతే..."

"లేకపోతే పైన మీరు స్థిరపరచుకొన్న వివాహానికి బందోబస్తు అన్నమాట! అంతే కాదూ! భలే మంచి ఆలోచన చేసినారు వదినామరదళ్లిద్దరూ! ఆడవాళ్లు ఎంతకైనా సాహసులు సుమా! ఎగతాళికేమిగాని, ఇందూ! నీవు నామనసు నిజముగా దొంగిలించినావు. అందుచేతనే నేను ఆ అన్యవివాహవిషయములో అన్ని ఆలోచనలు తుడిచివేసికొన్నాను."

"అయితే అది ప్రేమపూర్వక వివాహము కాదన్నమాట! అందుచేతనే దానికి విఘాతము కలిగినది. నేను మీ మనస్సు దొంగిలించుకొన్నానన్నారే, అది ఎప్పుడో చెప్పగలరా?"

"అదంతా తరువాత చెప్పతానులే."

"ఎప్పుడు దొంగిలించుకొన్నానో ఆ కొంచెము మాత్రము చెప్పండి."

"ఎప్పుడా? ఏరాత్రి మొట్టమొదట మంచము మీద నాకాళ్లగట్ట పడుకొని నీవు నిద్రపోయినావో అప్పుడు ప్రారంభమైనది. తరువాత త్రోవలో వృద్ధి పొందినది."

చాణక్యపండితుడు శిష్యులకు ఉపదేశించినాడు: 'ఘృతకుంభమువంటివాడు పురుషుడు; తప్తాంగారమువంటిది స్త్రీ. ఈ రెంటిని, ఆ ఇద్దరిని ఒక్కచోటికి చేర్చరాదు. చేర్చితే వికారము సంభవించక తప్పదు' అని. అందులో ఆ స్త్రీపురుషు లిద్దరూ తరుణవయస్కులై భార్యాభర్తలుకూడా అయితే ఇక రక్షణ మేమి ఉంటుంది?

ఇందులేఖ మందహాసము చేస్తూ, "త్రోవలో ఆ మాట చెప్పలే దేమి?" అన్నది.

శ్రీనివాసరావు ముగ్ధదృష్టితో ఆమెవంక చూస్తూ ఊరకొన్నాడు. అప్పుడు ఇందులేఖ మృదుస్వరముతో, "శైలబాల! శైలబాల నా భర్తను అపహరించగలదా? ఆమెకు సాధ్యమవుతుందా? పోదాము పదండి కాకినాడకు. ఆమెను ఒక్కసారి చూస్తాను" అన్నది.

"ఇక కాకినాడ వెళ్లడము లేదు. నీకు కొంచెము కులాసా చిక్కగానే విశాఖపట్నము వెళ్లి అక్కడ పదిరోజు లుండి తరువాత ఇంటికి వెళ్లుదాము."

ఇందులేఖ ఆ మాటలు వినిపించుకోకుండా, "ఆమె మిమ్ము నిజముగా ప్రేమించినదా? అట్లయితే ఈ సంగతి తెలియగానే పాపము చాలా దుఃఖపడుతుంది కాబోలు!" అన్నది.

"ఆమె నన్ను ప్రేమించినదో, లేదో ఆమె హృదయానికే తెలియాలె, ఆ ఈశ్వరునికే తెలియాలె!"

"ఆమె ఆమాట చెప్పలేదా? మీరు అడుగలేదా?"

"ఆమెదగ్గిర ఎప్పుడూ ఈ ప్రసంగము రాలేదు."

"మీ రామెను ప్రేమిస్తున్న సంగతి అయినా ఆమెకు తెలుసునా మరి?"

"ఎలా తెలుస్తుంది?"

ఇందులేఖ అభిమానభరముతో, "ఆమెకు తెలియకపోవచ్చు. కాని మీ రామెను ప్రేమిస్తున్నారు కదా!" అన్నది.

"ఎలా ప్రేమిస్తాను? అలా అయితే ఇంత శీఘ్రముగా నీవు నాహృదయములో దూరి నన్ను ఎలా జయించగలుగుతావు? ఇప్పుడు జరిగిన ఈ సంఘటన వల్ల నేను ఆమెను యథార్థముగా ప్రేమించడము లేదని ఋజువైనది గదా! కేవలము చూపుల ప్రేమ ఉండేది. అంతే! కాని హృదయములో చొరలేదు. ఆమె ఇంగ్లీషుచదువు, బెరుకులేని మాటలు, అరమరలేని చిరునవ్వులు, మురిపించే మర్యాద, మరపించే నవీనత సౌందర్యస్ఫురణ కలిగించి నామనస్సును ఆకర్షించినవి."

మరి రెండు రోజు లైనతరువాత ఇందూలేఖ పథ్యము పుచ్చుకొన్నది. మరి రెండు రోజులు ఇద్దరూ ఉద్యానగృహములో చాలా సుఖముగా, సంతోషముగా కాలము గడపినారు.

నాటిరాత్రి వారి నిద్దరిని డాక్టరు భోజనానికి ఆహ్వానించినాడు. మరునాడు ఉదయము బండికి విశాఖపట్నము పోవడానికి వారు అంతా సిద్ధము చేసుకొన్నారు.

ఆ సాయంకాలము డాక్టరుగారి ఇంటివసారాలో కూర్చుని టీ త్రాగుచుండగా శ్రీనివాసరావుకు రఘుపతివద్దనుంచి ఉత్తరము వచ్చినది. ఆ ఉత్తరము:

"బ్రహ్మకృపా హి కేవలమ్!

కాకినాడ,

జ్యేష్ఠ బ ౨ మంగళవారము.

ప్రియసోదరా!

సోదరి ఇందులేఖ జబ్బుపడిన దని విని చాలా విచారించినాను. ఈశ్వరు డామెకు శీఘ్రముగా ఆరోగ్యము కలిగించుగాక!

నేడు నీ కొక దుఃఖవార్త తెలుపుతున్నాను. దానిని నీవు ధైర్యముతో సహించవలెను. శైలబాల నిన్ను ప్రేమిస్తున్న దనే విషయములో నీకు దృఢ విశ్వాస మున్నట్లు చెప్పినావు. నాకుకూడా అట్టి విశ్వాసమే కలిగినది. కాని నిన్నసాయంకాలము ఆ నా విశ్వాసము విధ్వస్తమైనది. శంకరరావుకు, శైలబాలకు వివాహము స్థిరపడిన దని విన్నాను. వా రిద్దరూ రెండు సంవత్సరాలనుంచి పరస్పరానురాగబద్ధు లని కూడా విన్నాను. అందుచేత శైలబాల నిన్ను ప్రేమిస్తున్న దనే నీ విశ్వాసము కేవలము భ్రాంతిమాత్రమే!

నీకు ఇంకొక భ్రాంతి ఉన్నది. అదికూడా ఇప్పుడే తొలగించడము అవసరము. హైందవధర్మ ప్రకారము సంపన్నమైన వివాహమునకూ, నూతన బ్రాహ్మధర్మరీత్యా సంఘటితమైన వివాహమునకూ ఏమీ సంబంధము లే దని నీ విదివరకు అభిప్రాయపడి ఉన్నావు. కాని భార్యాభర్త లిద్దరూ బ్రాహ్మధర్మము స్వీకరించినప్పటికీ హైందవవివాహ ధర్మసంబంధము విచ్ఛిన్నము కాజాలదు.

నీవు కాకినాడ వస్తావా? నాలుగైదు రోజులలో సోదరి ఇందులేఖకు ఆరోగ్యము కలిగి మీ రిద్దరూ ఇక్కడికి రాగలిగినా వెనుక చెప్పిన ఉపాధ్యాయోద్యోగముకూడా మించిపోదు. అయినప్పటికీ నా సలహా ఏమి టంటే—సోదరిని గృహమునకు పంపివేసి నీవు కొన్నిరోజులపాటు హిమాలయములోని ప్రశాంత ప్రదేశమందుగాని, కలకత్తాలోని బ్రాహ్మమందిరమందుగాని ధ్యానోపాసనాదులు చేసుకొంటూ చిత్తశాంతీ, ఆత్మశాంతీ కలిగించుకోవలసినది అనీ. తమసో మా జ్యోతి ర్గమయ!

భవదీయుః,
ర ఘు ప తి.

పునశ్చ—శైలబాలవివాహము సందర్శించుటకై ఈ ౨౭ నాడు పిఠాపురము వెళ్లుతాను. ౨౧౦ నాటికి తిరిగి వస్తాను. మీరు రాదలచుకొంటే అప్పటికి రావచ్చును."

రాత్రి తొమ్మిదిగంట లైనతరువాత డాక్టరుగారి ఇంటినుంచి వచ్చి శ్రీనివాసరావు భార్యకు ఆ ఉత్తరము చూపించినాడు. ఇందులేఖ చదువుకొని నవ్వుతూ, అయితే శైలబాలమీద నా కిక కోపము లేదు. విశాఖపట్నము పోవడము మాని, పిఠాపురము పోయి, శైలబాలవివాహము చూతాము" అన్నది.

"అలాగే పిఠాపురము పోదాము. శంకరరావు వద్దనుంచి ఆహ్వానముకూడా వచ్చినది. విశాఖపట్నము పోదా మనడములో నాకు ఇంకో ఉద్దేశ్యముకూడా ఉన్నది. ఏమి టంటే—శైలబాల నన్ను మరచిపోవడానికి అవకాశము కలిగించిన ట్లవుతుం దని."

ఆ మాట వినగానే ఇందులేఖకు అభిమానజ్యోతి ప్రదీపించినది. వెంటనే ఆమె ఇలా అన్నది: "ఇందాక మనసులోని మాటగా చెప్పితే నిజమే అనుకొన్నాను. అందుకోసమా, నా శరీరారోగ్యము మిష పెట్టి విశాఖపట్నము పోదా మన్నారు!"

బయట అంధకారములో వకుళవృక్షుమీద కూర్చుని కోకిల వారి సంభాషణ ఆలకిస్తున్నది. దానికి మానవభాష తెలుసును కాబోలు! వ్యాజపూర్వకము లైన ఆమెఅభిమానవాక్యాలు వినగానే దానికి సంతోషము కలిగిన ట్లున్నది. అందుచేతనే అది మాటిమాటికి కుహూకుహూ అని పంచమస్వరముతో కూయడము ఆరంభించినది. శ్రీనివాసరావు భార్యను హృదయానికి హత్తుకొని, "కాదోయ్, కాదు—అది కాదు" అంటూ ముద్దుబెట్టుకొన్నాడు.

---